31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
ఆదివారం 15 మార్చి 2026 పేజీలు : 8

## పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

### జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 14:** పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత అన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా శనివారం జగిత్యాలలోని పురాణిపేట ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు 2లో

# బండి...జగమొండి...

**-11 గంటల్లో 40 కి.మీలు నడిచేనండి**

**-మండుటెండను సైతం లెక్క చేయకుండా కొండగట్టుకు చేరిన బండి...**

**-మధ్యాహ్న భోజనం వద్ద ఒకసారి, తేనెటీగ దాడి సమీపంలో మరోసారి కొద్దిసేపు సేద దీరిన కేంద్ర మంత్రి**

**-సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేస్తూ నడిచిన కాషాయ శ్రేణులు**

**-దిగ్విజయంగా ముగిసిన "అంజన్న ఆశీర్వాద యాత్ర బీజేపీ ప్రజాప్రతినిధులతో కలిసి అంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకున్న బండి సంజయ్**





**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చ్ 14 :** "అంజన్న ఆశీర్వాద యాత్ర" పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ ప్రజాప్రతినిధులతో చేపట్టిన ఒకరోజు పాదయాత్ర దిగ్విజయంగా ముగిసింది. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే తన పార్లమెంట్ పరిధిలో ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటానంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. 11 గంటల్లో ఏకబిగిన దాదాపు 40 కిలోమీటర్ల మేర నడిచి కొండగట్టుకు చేరుకున్నారు దాదాపు 40 డిగ్రీల మండుటెండను సైతం లెక్క చేయకుండా...మధ్యలో చిన్న అవాంతరాలు ఎదురైనా, తేనెటీగలు హంగామా సృష్టించినా అదరకుండా బెదరకుండా అన్నీ అధిగమిస్తూ అంజన్న ఆలయ సన్నిధికి చేరుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్, మేయర్ తో కలిసి అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

యాత్ర ప్రారంభమైందిలా....

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిజీగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు ఢిల్లీ నుండి బయలుదేరి అర్ధ రాత్రి 1.30 గంటలకు కరీంనగర్ కు చేరుకున్నారు. మరుసటి ఉదయం 6 గంటలకే లేని రడీ అయ్యి 7 గంటలకే కరీంనగర్ మహాశక్తి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుండే అంజన్న ఆశీర్వాద యాత్రను ప్రారంభిస్తున్న మీడియాతో మాట్లాడారు. అక్కడికి చేరుకున్న నూతనంగా ఎన్నికైన బీజేపీ సర్పంచులు 108 మంది, 450 మంది వార్డు సభ్యులు, 54 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లతోపాటు వేలాది మంది కాషాయ శ్రేణులతో కలిసి కాలినడకన బయలుదేరారు.

బూట్లు లేకుండా సాక్సులతోనే మండుటెండలో నడిచిన బండి రాజకీయాలకు అతీతంగా చేపట్టిన ఆధ్యాత్మిక యాత్ర కావడంతో...బండి సంజయ్ పాదయాత్రలో బూట్లు వేసుకోలేదు. సన్నిహితులు ఎంత ఒత్తిడి చేసినా బూట్లు వేసుకునేందుకు ససేమిరా అన్నారు. కేవలం సాక్సుల తోనే నడక ఆరంభించారు. మండు టెండలో తారు రోడ్డుపై చెప్పులు లేకుండా కొద్దిదూరం నడవాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. కానీ అవేవీ లేకుండా వట్టి సాక్సులతోనే ఏకంగా 40 కి.మీల

### పదవ తరగతి పరీక్ష కేంద్రాలను
## పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బిగితే

**-పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు**

**-163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 144 అమలు**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట మార్చి 14 :** పదవ తరగతి పరీక్షల సందర్భంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుసుమ రామ య్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడుతున్న తీరును ఎస్ పి సమీక్షించారు. పరీక్షాకేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 34 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 144అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని,ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడ కుండా చూడలనీ పోలీస్ లను ఎస్ పి ఆదేశించారు.పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని – 2లో

## ముస్లిం కమిటీ ఎన్నికల కమిషనర్ గా ఇమ్రాన్





**జగిత్యాల, మార్చి, 14 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని జమా మసీద్‌లో ముస్లిం మత పెద్దలు,ముస్లిం కమిటీ సమావేశం నిర్వహించి సెంట్రల్ ముస్లిం కమిటీ ఎన్నికల కమిషనర్‌గా సీనియర్ జర్నలిస్ట్ మొహమ్మద్ ఇమ్రాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఎన్నికల కమిషనర్‌గా ఉన్న మహమ్మద్ అలీ గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన లెక్కలు చూపించకపోవడంతో పాటు నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ మత పెద్దలు ఆయనను తొలగించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్‌ను మత పెద్దలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ భారీ, జనరల్ సెక్రటరీ హాజా నయుముద్దీన్ మంజూర్, అబ్దుల్ సజీద్, అఖీల్ ఉద్దిన్ జావీద్, పట్వారి సాజిద్, పట్వారి ముజాహిద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, కౌన్సిలర్లు కమల్, అయూబ్ ఖాన్, అఫ్రోజ్, అహ్లె హదీస్ జగిత్యాల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, జమాతే ఇస్లామియా నాయకులు ఈమాదుద్దీన్, తౌహీద్ అలీ, పాత్రికేయులు మోసిక్, హైదర్ అలీ, అదిల్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

## మస్జిద్‌కు డిజిటల్ వాచ్ అందజేత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 14 :** కమాన్‌పూర్ మండలంలోని గుండారం మహమ్మదీయ మస్జిద్ కు డిజిటల్ వాచ్ ను రామగుండం చెందిన అఫ్రోజ్ ఖాన్ శనివారం అందజేశారు. రామగుండం కు చెందిన అఫ్రోజ్ ఖాన్, అస్లాం ఖాన్, అష్టఫ్ ఖాన్ ల తండ్రి అబ్దుల్ కలాం ఇటీవలే స్వర్గస్తులైనారు. ఆయన స్మారక అర్థం సుమారు 15 వేల రూపాయల విలువ గల డిజిటల్ వాచ్ ను ఆయన కుమారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత గురువు ఫెరోజ్ ఆలం సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్, సర్వర్ ఖాన్, మథిన్ ఖాన్, అర్ఫాణ ఖాన్, అహ్మద్ తదితరులు ఉన్నారు.

## రామాలయ నూతన కమిటీ అధ్యక్షులుగా కొండే వెంకట్ రెడ్డి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 14 :** ఎల్లారెడ్డి పేట మండలం బండ లింగంపల్లి గ్రామ సర్పంచ్ బాలరాజు నరసాగౌడ్ అధ్యక్షతన రామాలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకోవడం జరిగింది.కమిటీ అధ్యక్షులుగా కొండే వెంకట్ రెడ్డి ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి బాలరాజు అలాగే 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. నూతన రామాలయ కమిటీ కార్యవర్గానికి అభినందనలు తెలిపిన గ్రామపంచాయతీ పాలకవర్గం ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డు రాజు గారు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## ఆత్మహత్య చేసుకున్న కుమార్ నేత్రదానం...ఇద్దరికి చూపు..!



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 14 :** గోదావరిఖని మేదరి బస్తీకి చెందిన పిల్లి కుమార్ (45) జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే దుఃఖంలోనూ భార్య రజిత భర్త నేత్రాలను దానం చేయడానికి అంగీకరించడంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగింది. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో కుమార్ కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా భార్య రజిత తీసుకున్న నిర్ణయాన్ని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా జర్నలిస్టు సంఘం ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్ పందిళ్ల శ్యామ్ సుందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, కేవీఎస్ వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి. మల్లికార్జున్ తదితరులు అభినందించారు.

# బండి...జగమొండి...

బండి సంజయ్ నడవడం అందరినీ విస్మయానికి గురి చేసింది.

**టెన్త్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా...ట్రాఫిక్ జాం కాకుండా యాత్ర**

ఈరోజే టెన్త్ పరీక్షలు ప్రారంభం కావడం, 9.30 గంటలకే టెన్త్ పరీక్ష ఆరంభం కావడం... అదే సమయంలో బండి సంజయ్ చేపట్టిన పాదయాత్ర కరీంనగర్ జగిత్యాల హైవేపైకి రావడంతో ట్రాఫిక్ జాం అవుతుందనే ఆందోళన కన్పించింది. కానీ బండి సంజయ్ వేలాది మంది కాషాయ దండుతో హైవేకు ఒకవైపు మాత్రమే... క్రమశిక్షణతో అటు పాదయాత్ర రక్షక దళం, ఇటు పోలీసుల సాయంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాదయాత్రను కొనసాగించడం విశేషం. ఈ విషయంలో పోలీసులకు పూర్తిగా సహకరించాలని, ఏ ఒక్క విద్యార్థికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని పదేపదే బండి సంజయ్ కోరడం గమనార్హం. ఫలితంగా విద్యార్థులకు, వాహనదారులకు పెద్దగా ఇబ్బంది లేకుండా హైవేపై సాఫీగా పాదయాత్ర సాగింది.

**కోన్ రావుపేటలో తేనెటీగల కలకలం...లెక్క చేయని బండి సంజయ్**

అసలే ఎండా కాలం... 40 డిగ్రీల దాకా ఎండ. మధ్యాహ్నం చెమటలు కక్కుతున్నా లెక్క చేయకుండా బండి సంజయ్ జోష్ తో నడవటం చూసి కాషాయ శ్రేణులంతా మేము సైతం అంటూ అడుగులో అడుగు వేసుకుంటూ కదం తొక్కారు. రామడుగు మండలం కోన్ రావుపేట వద్దకు రాగానే.. అక్కడ భారీ ఎత్తున జనం రావడం....భారీ ఎత్తున డీజే సౌండ్ తో కోలాహలం నెలకొనడం... ఆ జోష్ లో కొందరు కార్యకర్తలు డ్రోన్ ఎగరేయడం... అక్కడే చెట్టుపైనున్న తెనేతుట్టె కదిలి అందులోనుండి తేనెటీగలు బయటకు రావడంతో కాసేపు గందరగోళం నెలకొంది. తేనెటీగల దాడిలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో ముగ్గురు కాషాయ శ్రేణులు గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స ఇప్పించారు. అయితే కేంద్ర మంత్రి బండి సంజయ్ మాత్రం తేనెటీగల దాడి చేయకుండా అప్రమత్తమయ్యారు. కాసేపు రోడ్డు పక్కనే ఉన్న బెంచిపై ఆగి సేదదీరారు. పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన అంబులెన్సులో ఉన్న డాక్టర్లు వచ్చి బండి సంజయ్ ను రోటీన్ హెల్త్ చెకప్ చేశారు. కొద్ది నిమిషాల తరువాత అంతా సద్దుమణగడంతో మళ్లీ బండి సంజయ్ తన పాదయాత్రను యాధావిధిగా కొనసాగించారు.



**గంగాధరలో లంచ్...సాయంత్రం తిరిగి యాత్ర ఆరంభం**

రామడుగు మండలం కోన్ రావుపేట నుండి బయలుదేరిన పాదయాత్ర కురిక్యాల మీదుగా మధ్యాహ్నం 3.30 గంటలకు గంగాధర మండల కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ స్థానిక వీఏఎస్ ఫంక్షన్ హాలులో బీజేపీ శ్రేణులందరికీ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. బండి సంజయ్ సైతం అక్కడే ఓ కార్యకర్త ఇంట్లో మధ్యాహ్న భోజనం చేసి కాసేపు సేద దీరారు. సాయంత్రం 5.30 గంటలకు తిరిగి పాదయాత్రను ప్రారంభించిన బండి సంజయ్ వెంకటాయపల్లి, పూడూరు మీదుగా కొండగట్టుకు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటలకు దొంగలమర్రి ఇ రోడ్ వద్దకు చేరుకున్నారు. దొంగల మర్రి నుండి రాత్రి 7.30 గంటల వరకు కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు చేరుకుని "అంజన్న ఆశీర్వాద యాత్ర"ను దిగ్విజయంగా ముగించనున్నారు. అనంతరం బీజేపీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇచ్చిన మాట ప్రకారం ఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

## పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

**మొదటి పేజీ తరువాయి...** తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో డిఈఓ కె. రాము , తహసీల్దార్ రామ్మోహన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఈద్గా సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ -- వైస్ చైర్‌మన్

**చురకలు ప్రతినిధి కోరుట్ల మార్చి 14:** కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్ట ఈద్గాను మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్‌మన్ ఎండీ షాహిద్ శనివారం సందర్శించారు ఈ సందర్భంగా ఈద్గా అధ్యక్షులు ఎండీ అస్రార్ ఉపాధ్యక్షులు ఎండీ సజ్జు మైనారిటీ కౌన్సిలర్లు కూడా పాల్గొన్నారు రంజాన్ పండుగ నేపథ్యంలో ఈద్గాలో ఉన్న పిచ్చి చెట్లు పెయింటింగ్ లైనింగ్ వాటర్ సప్లై పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను వారు పరిశీలించారు అలాగే ఈద్గా కమిటీ సభ్యులతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకున్నారు వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు .

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బిగితే



**మొదటి పేజీ తరువాయి...**100 మీటర్ల పరిధిలో అన్ని ఫోటోకాపీ ,జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.పోలీస్ శాఖ విధించిన నిబంధనలను అతిక్రమించి పరీక్షా కేంద్రాల వద్ద ఎవరయినా గుమిగూడినా , అనుమతి లేకుండా జిరాక్స్ సెంటర్లు తెరిచినా సంబంధిత వ్యక్తులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రజలందరూ పోలీస్ అధికారులకు సహకరించాలని కోరారు.ఎస్పీ మహేష్ బి గీతే వెంట సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి, తహసిల్దార్ సుజాత, ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ ఎస్సై రాహుల్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే

**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 14 :** వృద్ధ తల్లి దండ్రులను నిరా దరిస్తున్న కొడుకులకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అస్సోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రానికి జిల్లాలోని జగిత్యాల,కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలోని వివిధ మండలాలకు చెందిన వృద్ధులు చేసిన ఫిర్యాదులపై వారి కొడుకులను, కోడళ్ళ ను పిలిపించి వృద్ధ తల్లిదండ్రులను పోషించకుండా వేధింపులకు, నిరాధరణ



కు గురిచేస్తే సంబందించిన ఆర్డీవోలు 6మాసాల జైలుశిక్షతో పాటు,తల్లి దండ్రుల నుంచి తీసుకున్న ఆస్తులను తిరిగి ఆ తల్లిదండ్రుల పేరిట పట్టా మార్పిడి చేయించడం జరుగుతుందని ఆ కొడుకులను,కోడళ్ళను హెచ్చరించారు.జగిత్యాల,కోరుట్ల,మెట్ పల్లి డివిజన్లలో కొందరికి పడ్డ జైలు శిక్షలను వివరించారు.అనంతరం వారు స్టాంప్ పేపర్ పై ఒప్పంద పత్రాలు రాసిచ్చి తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లారు.ఈ కౌన్సిలింగ్ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ జీ. ఆర్. దేశాయ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథ్ , ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, పి. అశోక్ రావు,బొల్లం విజయ్, కోశాధికారి వి. ప్రకాష్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎం. డి.యా కూబ్, సత్యనారాయణ,మానాల కిషన్,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జెల బుచ్చి రెడ్డి లు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది

**-సర్పంచ్‌ల పోరం మండల అధ్యక్షుడు కాశీరెడ్డి భాస్కర్ రెడ్డి**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (14) :** గ్రామాలభివృద్ధికి తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అదిక ప్రాధాన్యత ఇస్తుందని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం సర్పంచ్ ల పోరం అధ్యక్షుడు కాశీరెడ్డి బస్కర్ రెడ్డి అన్నారు.ఈసందర్భంగా అమ్మకపెట్ గ్రామం లో మొట్టమొదటి ఇంద్రమ్మ ఇల్లు ప్రారంభ కార్యక్రమన్ని నిర్వహించ కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం , గ్రామాలభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గృహహీన పేదలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంద్రమ్మ ఇళ్ల పథకంద్వారా ఎన్నో కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపబడుతున్నాయన్నారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇల్లు కల సాకారం చేసుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని,గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సుచించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన



సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాపెల్లి దిలీప్ కుమార్, దర్శనం గంగాధర్, జిల్లాపెల్లి లక్ష్మణ్, జిల్లాపెల్లి ముత్తయ్య, జిల్లాపెల్లి భూమయ్య, చిట్యాల నర్సక్క మహిళా నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చురకలు విలేకరి,మెట్‌పల్లి, మార్చి 14 :**

మెట్‌పల్లి పట్టణంలో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అలాగే రాధ్య బ్లడ్ బ్యాంక్‌లో



రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా జనసేన సైనికులు,పవన్ కళ్యాణ్ అభిమానులు సుమారు 60మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అయ్యప్ప గుడి ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించి,రోడ్డుపై ఉన్న నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని,రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా జనసేన జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎలుగందుల అజయ్ కుమార్, బండి రమాదేవి, మ్యాడరపు మారుతి, అబ్బూరి ఆనంద్ రాజ్ గౌడ్, కోటగిరి అరుణ్ గౌడ్,వన్నెల రాకేష్, కదరి శ్రీకాంత్,పత్రె సంతోష్, రాంప్రసాద్,యూసుఫ్ నగర్ ఉపసర్పంచ్ బసవేని రమేష్, మణి సాయి,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ విగ్రహా ప్రతిష్టాపన

చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 14 : జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట గోపాల్రావు పేట గ్రామంలో శనివారం హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహా ప్రతిష్టాపన



కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ అర్చకులు ఆశీర్వదించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్, నాయకులు మహేశ్వర్రావు, సిద్దార్థ హరి, విజయరామకృష్ణ, వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

# కోరుట్ల ఈద్గా సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ - వైస్ చైర్మన్



**చురకలు ప్రతినిధి కోరుట్ల మార్చి 14 :** కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ఈద్గాను మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ ఎండీ షాహిద్ శనివారం సందర్శించారు ఈ సందర్భంగా ఈద్గా అధ్యక్షులు ఎండీ అస్రార్ ఉపాధ్యక్షులు ఎండీ సజ్జు మైనారిటీ కౌన్సిలర్లు కూడా పాల్గొన్నారు రంజాన్ పండుగ నేపథ్యంలో ఈద్గాలో ఉన్న పిచ్చి చెట్లు పెయింటింగ్ లైనింగ్ వాటర్ సప్లై పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను వారు పరిశీలించారు.ఈద్గా కమిటీ సభ్యులతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకున్నారు.వాటి పరిష్కారా నికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు మైనారిటీ కౌన్సిలర్లు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# తెజెసా ఇంచార్జి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి ఇబ్రహీంపట్నం,మార్చి 14 :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లో తెలంగాణ జనసమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి తాత గారు కంతి ల్యాడ లింగన్న మార్చి 4న మృతిచెందగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.అయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లురి మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు జున్ను రాజేందర్, సర్పంచ్ మహేందర్ గౌడ్,మాజీ ఎంపిటిసి, సర్పంచులు గంగారెడ్డి,రాజు,స్థానిక నాయకులు మాజీ ఉప సర్పంచ్ రామ్ రెడ్డి,సింగిల్ విండో మాజీ చైర్మన్ అబ్బిడి రాజారెడ్డి,ఐలాపురం భూమా రెడ్డి,కాట దశరత్ రెడ్డి,చింతకుంట శంకర్,ఏశాల గంగాధర్,చెట్పల్లి నరేందర్,కనక మహేష్,మగ్గిడి నవీన్,మేడి నాగేష్,సలీం గజ్జ రాజేందర్‌లు ఉన్నారు.

# ప్రారభమైన పదవతరగతి పరీక్షలు

**-రెండు పరీక్ష కేంద్రాలలో హాజరైన 303 మంది విద్యార్థులు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (14) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పదవతరగతి బోర్డు పరిక్షలు శనివారం ప్రారంభం కాగ మెదటీ రోజు తెలుగు పరిక్ష జరిగింది.జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్,తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామపుర్, వేములకుర్తి,ఫకీర్ కోండాపుర్, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికోండాపుర్,వర్షకోండ, అమ్మకపెట్, డబ్బ, ఎర్రాపుర్, ఇబ్రహింపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామలలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవతరగతి విధ్యర్థులు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 213 మంది , గోధూర్ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులు మెత్తం 303 మంది పరీక్షలకు హాజరైనట్లు ఇబ్రహింపట్నం మండల విధ్యదికారి బండారి మధు తెలిపారు.

# రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

**-పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి**
**-నిరాహార దీక్షలో ఓసి నేతలు కిషన్ రెడ్డి, రాజన్నల విజ్ఞప్తి**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల , మార్చి 14 :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు విడుతల రైతు భరోసా నిధులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలనీ ఓసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి,జగిత్యాలజిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్నలు కోరారు.అన్నదాతలకు అండగా రైతుల సమస్యలు తీర్చాలని ఓసి నేత ముచ్చ సమ్మిరెడ్డి నిరాహార దీక్ష హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఓసి జేఏసీ, రైతు ప్రజా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టగా జగిత్యాల నుండి మహంకాళి రాజన్న,ఎన్నం కిషన్ రెడ్డి,ఓసీ జేఏసీ నాయకులు కట్కూరి చంద్రమౌళి , సూర శ్రీనివాస్‌లు హాజరై సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఓసి నాయకులు కిషన్ రెడ్డి,రాజన్నలు మాట్లాడుతూ ఓసిల్లోని పేదల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారిలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దన్నారు.రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులు ఆపై మొత్తాన్ని చెల్లించినప్పటికి మిగతా 2 లక్షలు పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలనీ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.సన్న,దొడ్డు రకాల వరికీ ఐదు వందల బోనస్ ఇవ్వాలన్నారు.రైతే రాజు అని చెప్పుకోవడమే కానీ పాలకులు రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.పొలాడి రామారావు పిలుపిచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం లోపే రైతు భరోసా, రుణమాఫీ చేయాలనీ కిషన్ రెడ్డి, రాజన్నలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.యాప్ ల్లో కాదు షాపుల్లో ఎరువులు అందించాలన్నారు.ఏప్రిల్ 28 న కరీంనగర్ లో లక్షమంది రైతులతో నిర్వహించే రైతు మహా గర్జన సమరబేరి సభను విజయవంతం చేయాలనీ కిషన్ రెడ్డి, రాజన్నలు పిలుపునిచ్చారు.రైతులు ఎదుర్కొంటున్నా సమస్యలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు. నిరాహార దీక్షలో ఓసి జేఏసీ, రైతు ప్రజాసంఘాల వేదిక జాతీయ అధ్యక్షులు పొలాడి రామారావు, ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, కంకణాల సరోజన, పెండ్యాల రాంరెడ్డి, స్వామిరెడ్డి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, పోరెడ్డి శంతన్ రెడ్డి, సంధి తిరుపతి రెడ్డిలు పాల్గొన్నారు.

# తుంగతుర్తి ఎమ్మెల్యే బేషరుతుగా క్షమాపణలు చెప్పాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 14 :** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వేద ఆశీర్వచనం చేసిన బ్రాహ్మణులపై బూతు పదాలు వాడినందుకు క్షమాపణలు చెప్పాలని అఖిల బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గాంధీభవన్లో 12వ తేదీన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణకు ఎస్సీ సెల్ చైర్మన్ గా పదవి ప్రమాణ స్వీకారం జరిగిన సభలో బ్రాహ్మణులు మానకొండూరు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ బాపనోళ్ళు చదివిన మంత్రాల్లో బూతు పదాలు పలికారు. ఈ సభలో అడ్లూరి లక్ష్మణ్ పొన్నం ప్రభాకర్ తదితర మంత్రులు పలువురు దళిత ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బహిరంగంగా వేదమంత్రాల అర్థం తెలుసుకోకుండా వేద ఆశీర్వచనం చేసిన బ్రాహ్మణులను పరుష పదజాలం తో ఆయన మాట్లాడడం సరి కాదన్నారు.సర్వేజనా సుఖినోభవంతు అంటూ వేద ఆశీర్వచనం చేసి శతమానం భవతి లాంటి వేదవాక్కులు పలికిన బ్రాహ్మణులను వేదాలను కించపరిచే విధంగా మాట్లాడాన్ని ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సభలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు కూడా వింటూ ఉండగా ఇలాంటి పరుష పదాలు వాడిన వ్యక్తిని ఎవరు కూడా అడ్డుకోలేకపోవడం ఇది హిందూ ధర్మం దౌర్భాగ్యం అని అన్నారు.ఏ మతంలో అయినా ఆశీస్సులు అందజేసేటప్పుడు తిట్ల పురాణం ఉండదని అన్ని మతాలు మంచినే బోధిస్తాయని తుంగతుర్తి ఎమ్మెల్యే తెలుసుకుంటే బాగుంటుందన్నారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి తాము వెనుకాడమన్నారు.ప్రతి బ్రాహ్మణుడు లోకాసమస్తా సుఖినోభవంతు అందరూ బాగుండాలని ప్రతినిత్యం కోరుకుంటారని అలాంటి బ్రాహ్మణులను దుర్భాషలాడడం తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఆ పదవికి ఆయన అనర్హుడని ఆగ్రహం వ్యక్తం చేశారు.వేదాల అర్థం తెలుసుకొని మాట్లాడాలని మందుల సామెల్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మోతే ఉమాకాంత్ శర్మ, నాయకులు సిరిసిల్ల రాజేందర్ శర్మ, సురేష్ శర్మ, సంగనభట్ల గుండయ్య శర్మ మేడిపల్లి శ్రీనివాస్ శర్మ, నేరెళ్ల శ్రీనివాస్ చారి, మెట్ట కిరణ్ భాస్కర్ శర్మ, కొత్తపల్లి శ్రీనివాస్ శర్మ గుండి శ్రీనివాస్ శర్మ, కొత్త పెల్లి రాజశేఖర్, రుద్రాంగి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19న లోక కళ్యాణార్థం

# ఓమౌ జయః మహా గంగా మహా రుద్ర చండీ యజ్ఞం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 14 :** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఓ మౌజయాః ప్రజ్ఞాన క్షేత్రంలో ఈనెల 19 వ తేదీన ఓ మౌజయః శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన మహోత్సవం సందర్భంగా లోక కళ్యాణార్థమై మహా గంగా మహా రుద్ర చండీ యజ్ఞం 24 గంటలు నిర్విరముగా జరుపబడును.19వ తేదీ గురువారం ఉదయం నాలుగు గంటల నుండి శుక్రవారం ఉదయం 4 గంటల వరకు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు పూర్ణాహుతి ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీ ప్రభు వారి అనుగ్ర ప్రవచనం జరుపబడును.మహా శక్తిపీఠం ఉత్సవ ఊరేగింపు శ్రీ ప్రభు పల్లకి సేవ పురుషార్థ పంచాంగ శ్రవణం భారతీయ సంస్కృతి సాంప్రదాయ కార్యక్రమాలు నగర సంకీర్తన దివ్య భజన అఖండ దీపారాధన కుంకుమార్చన భరతనాట్యం ప్రత్యేక హారతులు దివ్య సత్సంగం ప్రత్యేక ముద్ర ధ్యానం పుస్తకాల ఆవిష్కరణ ఉచిత అన్నదానం ఉచిత దివ్య ప్రసాద వితరణ జరుపబడును, పూర్ణహుతి సమర్పించుకోదలచిన భక్తులు ముందస్తు బుకింగ్ ద్వారా సమర్పించవచ్చు నని బంధుమిత్రులతో సహాయ పుణ్య కార్యక్రమములో పాల్గొని పరబ్రహ్మ సద్గురు వారి దివ్య అనుగ్రహమును పొందగలరని నిర్వాహకులు కోరారు.

# అవధానంలో అసమాన ప్రతిభుడు రాళ్ళబండి

**-మార్చి15...రాళ్ళబండి కవితాప్రసాద్ వర్ధంతి**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**



తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్థ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభునిగా, నిర్విరామ సాధనలో సాటిలేని మేటిగా వినుతికెక్కిన నిరంతర కృషీవలుడు రాళ్ళబండి. అవధాన విద్యలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో చిత్తశుద్ధితో ధృఢ సంకల్పంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తన పేరును తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని కవితా ప్రసాద్.సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కవితా ప్రసాద్ కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. కవితా ప్రసాద్ నెమలిలో పదవ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చేశారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. అనంతర కాలంలో ఇదే యునివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగం పట్ల ఆసక్తి కనబరిచారు. అవధాన విద్య పట్ల మక్కువ పెంచుకొని జీవితకాలం ఆ ప్రక్రియలో రాణించారు. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం, తదితర విశిష్టమైన, అతి క్లిష్టమైన దశలను సమర్థంగా పరిచయం తెలుగు సాహితీ లోకానికి చేశారు. తెలుగు నేలపై గుబాళించిన ఈ ప్రాచీన సాహితీ ప్రక్రియలను ఎల్లలు దాటించారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఈ కృషిలో కొంత ఆయన జీవితకాలం లోనే గ్రంథస్థం అయింది. అలా ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు.ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింప జేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కవితాప్రసాద్ కృష్ణా జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో 1961, మే 21వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటేశ్వర ప్రసాదరాజు. కవిత్వం పట్ల మోజుతో తన పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్నారు. తండ్రి కోటేశ్వర రాజు తెలుగు పండితులు. తల్లి పేరు రత్నవర్ధనమ్మ. సత్తుపల్లిలో గణితశాస్త్రం ఐచ్ఛిక అంశంగా పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో అవధాన విద్యపై మసన చెన్నప్ప పర్యవేక్షణలో పి.హెచ్.డి. చేశారు.కవితా ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చాలా తక్కువ మంది చేసే అవధాన విద్య మీద పి.హెచ్.డి పూర్తిచేశారు. ఒక పక్క గ్రూప్ 1 ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం చేస్తూనే... మరోపక్క తనకెంతో ఇష్టమైన తెలుగు సాహిత్యంలో శిఖరాలను అందుకున్నారు. ఆశించిన గమ్యాన్ని చేరుకున్నారు. ఆయన 500కు పైగా అవధానాలను నిర్వహించారు. వాటిలో అష్టావధానాలతో పాటుగా శతావధానాలు, ద్విశతావధానాలు ఉన్నాయి. సంప్రదాయ అవధానంతో పాటు కథ, వచన కవిత, గణితం వంటి అనేక ప్రక్రియలను అవధానంలో చొప్పించారు.ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభను ప్రదర్శించారు. పండితుల మెప్పు పొందారు.వరంగల్ లోని భద్రకాళి దేవాలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఒకే రోజులో ఆశువుగా శతకాన్ని చెప్పారు. ఆశుకవితా ఝరి పేరుతో గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పి ఔరా అనిపించు కున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో సుదీర్ఘ కాలం సాంస్కృతిక విభాగంలో అనేక హోదాల్లో సేవలు అందించారు. రెండు పర్యాయాలు సంచాలకులుగా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ఆ కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీయస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరా బాదులో హృద్రోగంతో మరణించారు.

# రాబోయేది ఈవిల శకమే...కాంగ్రెస్ నేత ప్రణవ్

## -హుజురాబాద్లో ఎలక్ట్రిక్ బైక్ షో రూమ్‌ను ప్రారంభించిన ప్రణవ్

**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, మార్చి 14 :**

ప్రస్తుతం మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం నడుస్తోందని,రాబోయే కాలంలో పెట్రోల్,డీజిల్ వాహనాలు కనుమరుగవుతాయని కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్లో ఎన్టీవీ రిపోర్టర్ మాచర్ల రాజు గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూంను శనివారం



లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అన్ని ప్రముఖ కంపెనీలు ఎలక్ట్రిక్ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు,భారీ వాహనాలు తయారు చేస్తున్నాయని తెలిపారు.దీంతో ఇంధనం ఆదా కావడంతోపాటు కాలుష్యం తగ్గుతుందన్నారు.ప్రభుత్వాలు కూడా ఎలెక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని,సబ్సిడీలు అందిస్తున్నాయని వివరించారు. ఇటీవల ఆర్టీసీ ఈవీ బస్సులను తీసుకువచ్చిందని,అవి విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. చాలా మంది ఈవి వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లోనూ వినియోగిస్తున్నారని ఇది మంచి పరిణామమని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని,పాత్రికేయుడు టీన్యూస్ మహేష్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పాపాలను తొలగించే ఏకాదశి...పాప విమోచన ఏకాదశి

## -పాపవిమోచన ఏకాదశి సందర్భంగా

**రామ కిష్టయ్య సంగన భట్ల**

ఉగాదికి ముందు ఫాల్గుణ మాసంలో కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశినే పాపవిమోచని ఏకాదశి అంటారు.దీనినే పాప నాశని ఏకాదశి అని కూడా అంటారు.అంటే పాపాలను తొలగించే ఏకాదశి అని అర్ధం.పాపమోచని ఏకాదశి ప్రాముఖ్యతను శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునికి వివరించిన నేపథ్యం భవిష్యోత్తర పురాణంలో ఉంది. మంజు ఘోష అనే అప్సరస మేధావిని వైవాహిక జీవితంలోకి రప్పించిందని పురాణాలు చెబుతున్నాయి.పూర్వం మేధావి అనే మహర్షి తపస్సు చేసుకుంటుంటే ఇంద్రుడి ఆదేశానుసారం మంజుఘోష అనే అప్సరస తన నాట్యంతో ఆయన తపస్సు కు విఘ్నం కలిగించిందంట. ఆమె నాట్యానికి చలించిన మేధావి తన తపస్సుకి విఘ్నం కలిగించిందన్న



ఆగ్రహంతో ఆ మంజుఘోషను శపించారట.ఈ ప్రత్యేకమైన ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఆమెకు శాపవిముక్తి కలుగుతుందని మహర్షి ఆమెకు చెప్పాడు.ఆయన సూచన మేరకు మంజుఘోష ఏకాదశి వ్రతం ఆచరించి శాప విముక్తి పొందింది.ఋషి తాను కూడా అప్సరస వలలో పడి పాపాలు చేసానని భావించి పాపమోచని ఏకాదశిని ఆచరించాలని నిర్ణయించు కున్నాడు.పాప అంటే 'పాపం','మోచిని' అంటే తప్పించుకోవడం.ఈ విధంగా ఈ ఏకాదశి ప్రత్యేకంగా పాపాలను నాశనం చేయడంలో మరియు చేసిన పాపాలకు సంబంధించిన అపరాధాన్ని నాశనం చేయడంలో సహాయ పడుతుంది.చేసిన పాపాలను తొలగించినందున ఈ ఏకాదశిని పాపవిమోచని ఏకాదశి అని అన్నారు. ఈ రోజున ఏకాదశి వ్రతం పాటిస్తే తప్పక ఫలితం లభిస్తుందని పురాణాలు సైతం చెబుతున్నాయి. ఈరోజునే శ్రీకృష్ణునిని ఆందోళికోత్స వము జరుపుతారు. ఉయ్యాలలోని కృష్ణుని దర్శించినంత మాత్రమున కలికాలపు దోషాలు పొతాయని,.కృష్ణ ప్రతిమగల ఉయ్యాలను ఊచితే, వేయి అపరాధాలైనా క్షమింపబడతాయనీ, కోటి జన్మల పాపాలు తొలగడమే కాక విష్ణు సాయుజ్యము లభించగలదని పండితులు చెపుతారు.పాప మోచని ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేయాలి.ఈ పవిత్రమైన రోజున శ్రీమహా విష్ణువు ఆలయానికి వెళ్లి ఆరాధించాలి.స్వామి వారికి ఈరోజు పసుపు రంగు దుస్తులను అర్పించాలి.దీని తర్వాత 11 పసుపు పువ్వులు,11రకాల తీపి పదార్థాలను స్వామికి అర్పించాలి. అనంతరం విష్ణువు నామాలను, మంత్రాలను జపించాలి.అదే విధంగా ఈ రోజంతా ఉపవాసం ఉండాలి.ఈ రోజున ఉపవాసం ఉండి విష్ణుమూర్తిని ఆరాధిస్తే పాపాలు తొలగిపోతాయని శ్రీకృష్ణుడు స్వయంగా అర్జునుడికి చెప్పినట్టు పురాణ వచనం. అంతే కాకుండా ఈ వ్రతం ఆచరించిన వారికి మోక్షం కూడా లభిస్తుందట.

# ముస్లిం కుటుంబాలకు తోఫా కిట్ల పంపిణీ

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, మార్చి 14 :** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం కుటుంబాలకు తోఫా కిట్లను పంపిణీ చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కమాన్‌పూర్ మండలంలోని కమాన్‌పూర్, గుండారం, రొంపికుంట గ్రామాలలో ముస్లిం సోదరులకు ప్రభుత్వ తరఫున రంజాన్ తోఫా కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన కాలమని తెలిపారు. ఈ నెలలో ఉపవాసాలు పాటిస్తూ ప్రార్థనలు



చేయడం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సౌభ్రాతృత్వంతో జీవించడం గర్వకారణమని అన్నారు.ముస్లిం సోదరుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, రంజాన్ సందర్భంగా తోఫా కిట్ల పంపిణీ కూడా అందులో భాగమని వివరించారు. ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శు భాకాంక్షలు తెలియజేస్తూ, రంజాన్ పండుగ సమాజంలో ప్రేమ, శాంతి, సేవాభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తోఫా కిట్లు అందుకున్న ముస్లిం కుటుంబాలు తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సహాయం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలీక్,కమాన్‌పూర్ ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, వ్యవసయ మార్కెట్ కమిటి డైరెక్టర్ అబ్దుల్ రఫీక్,యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ యూసఫ్ లల్లు, మాజీ ఉపసర్పంచ్ మహమ్మద్ కలీం, మేరాజ్ హైమద్ ఖాన్, మతీన్ ఖాన్,రొంపికుంట మజీద్ కమిటీ ప్రెసిడెట్ జమీల్,ముజాహిద్, నజీబ్, గఫార్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో కొనసాగింది.

# కొనసాగుతున్న ఇందిరమ్మ గృహ ప్రవేశాలు



**చురకలు విలేఖరి,పెగడపల్లి, మార్చి 14 :** జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలంలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదనల తో పగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన పచ్చిమట్ల లావణ్య - తిరుపతి కి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నూతనంగా నిర్మించగా



శనివారం గ్రామ సర్పంచ్ కుంటాల వనజ - శ్రీనివాస్ తో కలిసి పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్ర నాగలక్ష్మి, ఉప సర్పంచ్ ఎడ్ల శ్యామ్ సుందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, వార్డు సభ్యులు సాయిళ్ల రాకేష్, మ్యాక రాయమల్లు, పచ్చిమట్ల భాగ్య, కుంటాల జమున, లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యలక్ష్మిని అభినందించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 14 :** కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పెద్దపల్లి జిల్లా సభ్యురాలు భాగ్యలక్ష్మి నీ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. శనివారం రోజున మానకొండూరు ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిటీ అధ్యక్షుడు కర్వంపల్లి సత్యనారాయణ ను పెద్దపెల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ



అట్రాసిటీ కమిటీ సభ్యురాలు ఇరుగు రాళ్ల భాగ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీల సమస్యలపై తమ మద్దతు కావాలని భాగ్యలక్ష్మి కోరారు. దీనికిగాను ఆయన పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తానని తెలియజేశారు.

# గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం

## -సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 14 :** గ్రామాభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తామని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు.రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులను తీర్మానించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ భాద్రపు.ప్రవల్లిక ప్రశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్, వార్డ్ సభ్యులు పబ్బా స్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్, జక్కుల పద్మ చందన్, కలవేన రవి, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నశీ మణి తేజ, జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్ ,కారోబర్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

**-పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 14 :** మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు .పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో పట్టణ,మండలంలోని ముస్లిం సోదరులకు శనివారం సాయంత్రం దావత్-ఇ -ఇఫ్తార్ & తామ్ విందును ఏర్పాటుచేసి అనంతరం ముస్లిం సోదరులకు, సోదరిమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నెల రోజులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాసం నుండి సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటారని అన్నారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక గా నిలుస్తాయన్నారు. నెలరోజుల ఉపవాస దీక్షలో అనేక సత్ ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనాది నుండి సుల్తానాబాద్ పట్టణంలో ముస్లిం సోదరులు కుల మతాలకు అతీతంగా సోదర భావంతో మెలుగుతారని అభినందించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను స్థానిక ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ, మరియు మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, దాన్నాయక దామోదర్ రావు, సాయిరి మహేందర్, ఐల రమేష్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదర సోదరీమణులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాతలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం తప్పదు

**-న్యాయం జరిగే వరకు తెలంగాణ ఉద్యమ తరహాలో రైతుల ఉద్యమం**

**-రైతు సంఘం నేత ముచ్చ సమ్మిరెడ్డి నిరవధిక నిరాహార దీక్షలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, మార్చి 14 :**

అన్నదాతలను ఇచ్చిన హామీలను నెరవేర్చడం లో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని, రైతులను విస్మరిస్తే మూల్యం చెల్లించక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి అన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద రైతు ప్రజాసంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా నాయకుడు ముచ్చ సమ్మిరెడ్డి శనివారం నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ.. రైతుల తరపున సమ్మిరెడ్డి దీక్షను చేయడం హర్షణీయమని అన్నారు. ప్రభుత్వం రైతులకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, రైతు భరోసా నిధుల విడుదలలో ఎందుకు జాప్యం చేస్తోందని, రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ 4 వేల కోట్ల నిధులను కమీషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారని ఆరోపణలు రావడం దారుణమన్నారు. రాష్ట్రంలో, దేశంలో రైతులు, కూలీలు, యువత, మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు లేవని, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని , ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ లో లక్ష మందితో రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన సమర భేరి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రైతు మిత్ర ప్రజాసంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందు పట్ల నరసింహ రెడ్డి, ఓసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెన్నం కిషన్ రెడ్డి, ఐలేని మల్లిఖార్జున రెడ్డి, ఓసి ఐకాస, ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డి, రెడ్డి ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చందుపట్ల జనార్ధన్, ముదిరాజ సంఘం నాయకులు స్వామి, మహిళా విభాగం ఓసి జేఏసీ చైర్మన్ కంకనాల సరిజన, లలిత రెడ్డి, ఆర్య వైశ్య సంఘాల జేఏసీ చైర్మన్ అయిత నాగరాజు, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు రావుల భాస్కర్ రెడ్డి, కాశిరెడ్డి మహేందర్ రెడ్డి, ఏనుగు చొక్కరెడ్డి, మహంకాళి రాజన్న, రెడ్డి సంపత్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కుమార స్వామి, వివిధ జిల్లాల ఐకాస, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు , వివిధ రాజకీయపార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

**-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చ్ 14 :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు.శనివారం మొదటిరోజు కరీంనగర్లో ఓల్డ్ హై స్కూల్, ధన్గర్ వాడి పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మూత్రశాలలు మరుగుదొడ్లు తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కమిషనర్ తనిఖీ..**

సాయి కృష్ణ థియేటర్ సమీపంలో ఎస్సార్ డిజె స్కూల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.పరీక్షా కేంద్రాల్లో వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని సూచించారు.



# ఇఫ్తార్ విందులో పాల్గొన్న వొడితల ప్రణవ్

**- రంజాన్ మాసంలో భక్తి శ్రద్ధలతో ఉపవాసం చేసే పండుగ రంజాన్**

**- మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**




**చురకలు విలేఖరి వీణవంక మార్చి 14 :** కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని,రంజాన్ మాసంలో ముస్లిం సోదరులందరూ అత్యంత భక్తితో ఉపవాస దీక్షలు చేస్తారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం నాడు వీణవంక మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాహెబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.దీనికి ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత మైనారిటీల ఆర్థిక వ్యవస్థను బాగు చేయడానికి ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి ద్వారా కుట్టు మిషన్ లు అందిస్తున్నా మని సబ్సిడీ కింద ఎలెక్ట్రిక్ బైక్లు అందజేస్తున్నామని అన్నారు.ఇదే విధంగా రాబోయే రోజుల్లో మైనారిటీ సంక్షేమానికి ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీణవంక ఎస్సై తిరుపతి,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులు,మండల అద్యక్షుడు, ఉపాధ్యక్షుడు,మండల సీనియర్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్చి 15 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం.1962, మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారు హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి15 తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 సంఘాలు, సంస్థలు 1973 మార్చి 15 ని వినియోగ దారుల హక్కుల దినంగా పాటించాయి.భారత దేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగ దారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగ దారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు... అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగ దారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియ జేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసు కోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగ దారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగ దారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం




వహించడం. వినియోగ దారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచు కోవడం, నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగ దారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగ దారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15 న జరుపుకుంటున్నాం. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ-కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసు కుంటున్నాయి. వినియోగ దారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగ దారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు.వినియోగ దారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్ గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ- జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి.జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు.రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియ జేయాలి.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



## -రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 14 :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం- అనర్థాలు",సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం మంథని పోలీసులు నిర్వహించారు.శనివారం స్థానిక నృసింహ శివకిరణ్ గార్డెన్‌లో మంథని పోలీస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం-- అనర్థాలు",సైబర్ నేరాలు,రోడ్డు ప్రమా దాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి రమేష్, ప్రవచనకర్త నాయక్ మహారాజ్,మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ముందు గా మంథని ఎస్ఐ రమేష్ ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగం గా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తై నా నాశనం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాల ను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువు కోవాలని సూచించారు.యువత చేతు ల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు,చదువు, సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచిం చారు. ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని,ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును నడిపే సమయంలో సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణిం చాలని,భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని, ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు, మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు. మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం సాధ్యమవు తున్నప్పటికీ,అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగు తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆపదలో ఆపద్బాంధవుడు మంత్రి శ్రీధర్ బాబు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 14 :** తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు. శనివారం మంథని మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఆకుల



రామ్మూర్తి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. రెండు లక్షల రూపాయలు చెక్కు మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఎల్వోసి చెక్కు మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.